# పోలీ శాంతీమియా వీరా?

## "వివేకమ్"

ఎవరన్నారో, ఎందుకన్నారో తెలీదుగానీ, అలా నోరు నెప్పి చేసి దవడలు వాచేలా — అనగా అనగా ఒకరాజు; అప్పుడే సాయంత్రాన్ని సాగనంపేసిన ఒకరోజు ప్రపంచాన్ని చల్లగాను, ప్రేమికుల్ని వేడిగానూ పరిపాలించడం ప్రారంభించేరు. ఆ రాజుగారి చూపులు విస్తృతంగా విస్తరించి, విశాలంగా విలాసంగా వున్నాయి. అది విశాఖపట్నంలో 'లాసన్సు బే' తీరంలో వున్న శాంతి ఆశ్రమంలోకి కూడా చొచ్చుకుని, అక్కడ ఏపుగా పెరిగిన సరుగుడు చెట్లని వొరుసుకుంటూ వచ్చి నేలమీదికి జారేయి. అప్పుడా చెట్లమధ్య ఓ చెట్టు నానుకుని ఠీవిగా రాజులా కూర్చున్న సారథి కూడా ఆ రాజులాగే ఎంతో అందంగా వున్నాడు.

ఆ రాజు నెలరాజు.

ఆ రోజు పున్నమిరోజు.

ఆ చూపులు వెన్నెల తూపులు.

ఆ సారథి మెడికల్ కాలేజీలో స్టూడెంటు.

ప్రస్తుతం శాంతి ఆశ్రమంలో సరుగుడు చెట్టుక్రింద కూర్చున్న సారథి చేతుల్లో ఒక అందమైన మాసపత్రిక వుంది.

శ్రద్ధగా అందులో సీరియల్ చదువుకుందామని సాయంత్రం అయిదింటికల్లా సారథి అక్కడికి వచ్చేడు. కాని సీరియల్ సగం చదివేసరికి సారథికి ఎంత ప్రయత్నించినా ఒక్క అక్షరం కూడా ముందుకి సాగలేదు. కారణం ఆ పేజీలో హఠాత్తుగా హీరోయిన్ బొమ్మ మరణించింది. సారథికి వెంటనే తన బొమ్మ గుర్తుకొచ్చింది. చేతిలో పుస్తకం మూసి, గతంలోకి జరిగి సారథి తన బొమ్మ గురించి చాలా సేపు ఆలోచించేడు. సంధ్య గడిచేవరకూ ఆలోచించేడు. కాస్సేపు సారథి కంటిముందు బొమ్మ బింబం తొణికిసలాడింది. చుట్టూరా వెన్నెల బొమ్మ ధరించే తెల్ల పట్టుబట్టలా కనబడింది. తలెత్తి చూసే చందమామలో బొమ్మ — పూజచేసుకొచ్చి పూజ్యగాంధీలా నవ్వుతూ నిలబడింది. ఆకాశంలో

నక్షత్రాలు బొమ్మ చేసుకునే వత్తుల్లా మెరిసేయి. ఒక్కసారి కళ్ళు చెమర్చిన సారథి తనకు తనే బరువుగా బాధగా "బొమ్మా!" అనుకున్నాడు. "భగవాన్!" ఎంతలో ఎంత మార్పు జరిగెను! కాల చక్రము కారు చక్రమువలె తిరిగెను కదా!" అని కూడా అనుకున్నాడు.

నాలుగేళ్ళ క్రితం వరకూ బొమ్మ చేతుల్లో పెరిగిన సారథి మనస్సు చాలా పొదుపుగా పనిచేసి, అతన్ని చాలా అదుపులో వుంచింది. అందుచేత అతనెక్కడా పరీక్ష ఫేలవకుండా, ఎంచక్కా ఏ రోజు పాఠం ఆరోజు చదువుకుని, ఏ రోజు గడ్డం ఆ రోజు గీసుకుని చకచకా డాక్టరయ్యేడు. అలా బొమ్మ హయాంలో ప్రపంచానికి పాతికేళ్ళు పాతబడిన పార్థసారథి చాలా మందికి మడిగట్టుకున్న వడి సారథిలా కనిపించేవాడు. సారథి బొమ్మ అతన్నెంతో క్రమశిక్షణలో పెంచింది. రోజూ పొద్దున్నే చద్దన్నం తినిపించి అతన్ని మెడికల్ కాలేజీకి పంపేది. సాయంత్రం అతని రాకకి గంటముందే వీధి గుమ్మంలో కూర్చుని, వొత్తులు చేసుకుని అవి కళ్ళల్లో వేసుకుని ఎదురుచూసేది. కాని యిదంతా నాలుగేళ్ళ క్రితం వరకే సాగింది. ఆ తర్వాత సారథి వొంటరివాడైపోయాడు. అతనికిప్పుడు బొమ్మ లేదు. సరిగ్గా నాలుగేళ్ళ క్రితం తనూ, బొమ్మా వొకేసారి పాసైపోయేరు — తను యం. బి. బి. యస్సూ, బొమ్మ జీవితమూ. సారథిలో అక్షణం నుంచీ గుర్తించ దగ్గ మార్పులెన్నో వచ్చేయి. మడి సారథి మడి ఆనాడే మబ్బులా విడిపోయింది. క్రమశిక్షణ పోయింది. అతని మనస్సు పరిధులు దాటి పరిపరి విధాల పోయింది. ఎన్నో పరదాలకేసి పోయింది. ఎన్నో కోరికల కేసి పోయింది. అవును మరి— బొమ్మ పోయింది.

అంతకాలం కాల్టెక్సు కంపెనీలో వుద్యోగం చేసినట్టున్న సారథికి కలెక్టరాఫీసులో కొత్త వుద్యోగం దొరికినట్టయింది బొమ్మ ఆసరాగా వున్నంతకాలం అతనికి ఏ వెలితీ కనిపించలేదు. కాని బొమ్మతో ఆసరాలన్నీ పోయినట్టయి, సారథికి జీవితంలో వెలితి అంటే ఏమిటో తెలిసింది. ఎవరేనా మంచి నేస్తం, తన జీవితంలో కాలు మోపి, అంత వరకూ ఆసరాగా నిలిస్తే బావుణ్ణనిపించిం దతనికి. అప్పట్నుంచే అతనిలో క్రమంగా మార్పు వచ్చింది. నాలుగేళ్ళలో పార్థసారథి ఎంతగానో మారేడు. అతని మార్పు చెడ్డదనీ చెప్పలేం — మంచిదనీ చెప్పలేం. అదొక చిత్రమైన మార్పు. ఎప్పుడూ క్లాసు పుస్తకాలు తప్ప మరే యితర పుస్తకం ఎరుగని

సారథి గొప్ప ఆధునిక తెలుగు సాహిత్య పిపాసిగా మారేడు. ఇప్పుడతను చదవని తెలుగు నవల గానీ, కథగానీ ఏదీలేదు. చంద్రుడి కోసం చాతక పక్షిలా నెలనెలా, వారం వారం పత్రికలకోసం ఎదురు చూసి చదివిన సారథికి కొన్ని సీరియల్ నవలలు కంఠోపాఠంగా వచ్చు.

ఇటీవలే సారథికి తను ఎంతగానో యిష్టపడిన ఒక సీరియల్ నవల్లో హీరోలా తయారవాలనే కోరిక కలిగింది. అందుచేత అతనీ మధ్య ప్రతిరోజూ కొంతసేపు చిత్రలేఖనం ప్రాక్టీసు చెయ్యడానికీ, కొంతసేపు ఫిడేలు వాయించడానికీ, కొంతసేపు గొంతెత్తి పాడటానికి కేటాయించుకొని దీక్షగా సాధన చేస్తున్నాడు. ఏదో వొకనాడు తన సాధన ఫలించి సాధనాలాంటి అమ్మాయెవరైనా తన్ను వలచి వరించక పోతుందా అని సారథి ఉద్దేశం.


సరుగుడు తోపుకి దూరంగా యిసుకలో నడుస్తూ జాలరి వాడెవడో కూనిరాగం తీసుకుంటూ పోతున్నాడు. వాణ్ని చూసేసరికి చల్లగాలీ, సముద్రమూ - సమయమూ అన్నీ కలిసి 'పాడ' మని తన్ను ఆదేశనిగా బలవంతం చేస్తున్నట్టు ఫీలయ్యేడు. ఒక్కసారిచుట్టూ చూసేడు. పాట పాడేందుకు ఇంతకంటే మంచి వాతావరణమూ, మంచి అవకాశమూ ఏం కావాలి గనుక ? వినేందుకు నలుగురూ లేకపోయినా, వున్నారనుకునే పాడాలనుకున్నాడు సారథి. గొంతు సరి చేసుకుని ప్రేమగీతం ఒకటి గట్టిగా ఎత్తుకున్నాడు. రెండు చరణాలు పాడగానే అతనికి సరుగుడు చెట్ల మధ్య, పారుతున్న సెలయేటి గలగల వినిపించి, దాహం వేసింది. వెంటనే పాట అపుచేసి లేచి నిలబడ్డాడు. ఎడారిలో పోడాలు దొరికినట్టు ఎంచేతనో యీ శాంతి ఆశ్రమంలో సెలయేరు పుట్టింది. బహుశా తన గాన మాధుర్యానికిక్కడ నాపరాళ్ళు కరిగి వుంటాయి అనుకుంటూ చెట్ల మధ్యకి నడిచేడు. కాని శబ్దాన్ని సమీపించేక సారథికి ఆశ్చర్యం ఎదురైంది. తన పాట వినేందుకు నలుగురూ లేరనుకున్న సారథికి వెన్నెల నీడలో వేడుకగా నవ్వుతూ ముగ్గురు వ్యక్తులు మసగ్గా కనిపించేరు. సారథికి కోసం వచ్చింది. లేచి నిలబడ్డాడు. వేగంగా అడుగులు వేస్తూ వాళ్ళ దగ్గరికి నడిచేడు. తీరా చూస్తే వాళ్ళెవరో కాదు. తన లేడీ స్టూడెంట్సు— శాంతిప్రియ, శాంతిలత, శాంతిసిరి— వెన్నెల నీడలో కలువరేకుల్లాగున్నారు. సారథి తత్తరపడ్డాడు.

అంతలో శాంతిప్రియ నవ్వి న పెదాలు మాట్లాడేయి — 'నిల్చుండి పోయారేం సార్! కూర్చోండి!'

మళ్ళా ముగ్గురూ గలగలా కిలకిలా పెలయేర్లై నవ్వేరు. సారథి యాంత్రికంగా కూర్చున్నాడు.

'మీరు పాడతారని మా కింత వరకూ తెలియదు సుమండీ?'— శాంతిలత మాట్లాడింది. వాళ్ళు మళ్ళా నవ్వులు ఓసిరేరు. ఈ మారు సారథి కూడా ఒక వెర్రినవ్వు నవ్వి అడిగాడు—'మీరు విన్నారా?'

మిగిలిన నవ్వుని పెదాల వెనుక



దిగ్గతొక్కుకుంటూ ముగ్గురూ అవునన్నట్టు తలలూపేరు.

'బాగా పాడేనా?' సారథి భావంలో అమాయకత కనబడింది.

శాంతి తయం మళ్ళీ అవునన్నట్టు తలలు వంకించేరు.

'మరెందుకూ నవ్వేరు?'

ఈ ప్రశ్నకి వాళ్ళ నవ్వులు శ్రుతిమించేయి. అశమమంతా ఆక్రమించేయి.

సారథికి కష్టం తోచింది ఎందుకిలా నవ్వుతారు వీళ్ళు? నవ్వితే తనకెందుకిలా బాధనిపిస్తోంది? అందమైన అమ్మాయిల నవ్వులు కూడా బాధ కలిగిస్తాయా? ఏమిటో — వెన్నెల నీడలా నవ్వుల బాధ! అయినా తనెందుకు బాధపడాలి? వాళ్ళేం



తప్పు చేసేరు?-నవ్వేరంతే. అవును. నవ్వడం, పిల్లల్ని కనడం ఆడవాళ్ళ జన్మహక్కు. వాళ్ళ హక్కుల్ని వాళ్ళు కాపాడుకుంటున్నారంతే. ఈ మాత్రానికి తనెందుకూ బాధ పడటం. ఎదుటివారి హక్కులను గౌరవించుట పౌరునివిధి. కాబట్టి తనిప్పుడు వారి నవ్వులను గౌరవించవలెను — అని ఆలోచించుకుని సారధి వాళ్ళని మెచ్చుకున్నాడు. "మీరు నవ్వడం బాగా వచ్చు."

"బాగా అంటే ?" శాంతి లత.

"అందంగా—"

ఈసారి శాంతిత్రయం నవ్వలేదు. మెరిసే కళ్ళతో సారధని చిత్రంగా చూసేరు. అందమైన ఆడపిల్లలు తనని అలా సూటిగా చూడటం సారధికదే తొలి అనుభవం. క్షణంపాటు చక్రవర్తిలా ఫీలయ్యేడు.

నిజం చెప్పాలొస్తే, సారధికి పాటలు పాడటంరాదు మనస్సులో కోరిక చంపుకోలేక పాడినా, విన్నవాళ్ళకి పాటలమీదే కోరిక చచ్చిపోతుంది. ఏమైనా సారధికి మాత్రం తన పాటమీద గొప్ప నమ్మకం వుంది. కాని, యిప్పుడు శాంతిత్రయం ప్రవర్తన ఆ నమ్మకాన్ని కాస్త సడలించినట్లుయింది. "నేను బాగా పాడలేదూ భగవాన్!" అనుకున్నాడు. అసలు వీళ్ళిక్కడున్నారని తెలిస్తే యింకా బాగా పాడేవాణ్నే, అని కూడా అనుకున్నాడు.

వెన్నెల షికారులన్నా, వేళాకోళాలన్నా శాంతిత్రయానికి బహు సరదా. రెండు క్షణాలపాటు గురువుగారి అందాన్ని తన్మయంగా చూసేక, సారధి అమాయకత్వాన్ని చొరవగా తీసుకున్న శాంతిత్రయం మరింత చనువుగా వేళాకోళానికి దిగేరు.

శాంతిప్రియ అడిగింది—"ఒక్కరే వచ్చారా సార్ ?"

"అవును. పాట పాడుకుందామని..." అతనిలో యిందాకటి అమాయకత యింకా అలాగే తొంగి చూస్తోంది"

సారధి పాట అనేసరికి శాంతిత్రయం మళ్ళీ గొల్లుమన్నారు.

"నవ్వేరంటే అబ్సెంటు మార్కు చేస్తాను." మంచి జోకు వేసేననుకున్నాడు సారధి.

"మీరు బాగా పాడతారే అనుకుంటే, బాగా జోకుతారు కూడానూ ?" శాంతిసిరి అంది.

"నిజంగా పాడుకోడానికే వచ్చారా సార్ ?" శాంతిలత అడిగింది.

సారధి బదులు చెప్పలేదు—ఇందాకే అతను వూహాలోకానికి వెళ్ళాడు. అప్పుడు శాంతిసిరి అతన్ని లోకానికి లాక్కొచ్చి

కూర్చొబెడుతూ గోముగా 'ఒక పాట పాడండి సార్!' అని అడిగింది.

'పాటా?' అన్నాడు పార్థసారధి.

'అవును పాటే. పాడండి సార్! వినాలని వుంది.'

'పాట కాదు. ముందు నా మాట వినండి.'

'ఏమిటి సార్?' శాంతిత్రయం చెవులు రిక్కించేరు.

'ఏమీలేదు. నేను పాడానని గాని, పాడతానని గాని మీరు ఎవ్వరితోనూ చెప్పనని ప్రమాణం చెయ్యాలి' సారధి సీరియస్‌గా అడిగేడు.

'బలేవారే-మీరెంతో బాగా పాడగలరని అందరితో చెప్పాలనుంది నాకు' అంది శాంతిలత.

'అడిగారు కాబట్టి అలాగే ప్రమాణం చేస్తాను' అంది శాంతిప్రియ.

'నేను ప్రమాణం చెయ్యను. మీరు ముమ్మాటికీ ఎంతో బాగా పాడతారు. ఇందాక మీ పాట విన్నప్పట్నుంచీ నాకెన్నోసార్లు మీ చేత పాడించుకోవాలని విస్తోంది' అంది శాంతిసిరి.

ముగ్గురిలో శాంతిసిరి మాటలు సారధిని ఆకట్టేయి. తన పాటమీద అతనికెంతో నమ్మకం పెరిగింది. ఏదో ధీమా కలిగింది. అప్పుడు సారధి పాట పాడేడు. శాంతి ఆశ్రమంలో అశాంతి మజిలీ చేసినట్లు పాడేడు. అయినా శాంతిత్రయం మాత్రం ప్రశాంతంగా పార్థసారధి పాట విన్నారు. నిజం చెప్పాలంటే కేవలం వాళ్ళ చెవులు మాత్రమే పాట విన్నాయి. మిగిలిన ఇంద్రియాలన్నీ ఇంద్రజాలికుడి మాయకి లొంగి పోయినట్లు సారధి స్వర ద్రూపానికి లొంగిపోయేయి.

సారధి పాట ముగిసేక శాంతిలత, 'సార్? మీకింత చక్కగా పాడటం వచ్చుగదా! ఏ పార్టీలోనన్నా ఒక్కసారి పాడకూడదూ?' అనడిగింది.

'ఏదో పార్టీ దాకా ఎందుకూ? నేనే కొద్దిరోజుల్లో అందర్నీ పిలిచి ఒక పార్టీ ఏర్పాటు చేసి పాడి విని పిస్తాను.' అని చెప్పి, 'అన్నట్టు వచ్చే మంగళవారం నా బర్త్ డే. నా ప్రోగ్రామ్ ఆ రోజున ఏర్పాటు చేస్తాను. ఆ వాళ తప్పకుండా మీరూ వద్దురుగాని. ఆ రోజు ఒక్క పాటేమిటి, ఫిడేలు కూడా వాయిస్తాను. ఏర్పాట్లన్నీ పూర్తయ్యేక, మీకు యిన్విటేషన్లు పంపిస్తాను' అన్నాడు.

అలా వాళ్ళ మధ్య ఎన్నో కబుర్లు నడిచేక, ఎన్నో క్షణాలు గడిచేక,

శాంతిత్రయానికి సారథి గుడ్‌నైట్ చెప్పేడు.

• • •

ఆ రాత్రి మంచంమీద వెల్లకిలా పడుకొన్న పార్థసారథికి నిద్ర పట్టలేదు. కిటికీలోంచి గుండ్రటి చంద్రుడు 'క్లోజప్‌లో యూల్ బ్రిన్నర్'లా కనిపించేడు. సారథికి సాయంత్రపు క్షణాలు పదే పదే గుర్తుకు వచ్చేయి. ఆ క్షణాలకంటె, ఆ క్షణాల గుర్తులోనే అతనికి మధురిమ మరింతగా కనబడుతోంది!— అయితే ప్రేయసితో గడిపిన క్షణాలకంటె, ప్రేయసితో గడిపిన క్షణాల గుర్తు యింకెంత తియ్యగా వుంటుందో! ఏమైనా అనుభవం కంటె ఆలోచన గొప్పది. నిజంగా ఈ రోజు తన జన్మ తరించింది. ఇన్నాళ్లూ వాళ్ళకి పాఠం చెప్పడమే మహాభాగ్యం అనుకుంటున్న తను, ఈ రోజు వాళ్ళకి పాట వినిపించేడు. తను వినిపించడమేమిటి? వాళ్ళే బలవంతపెట్టి తన చేత పాడించుకుని విన్నారు. ఒకరు కాదు, ముగ్గురు అందమైన అప్సరసలు వరసన కూర్చుని కావాలని మరీ విన్నారు. ఆ క్షణం శాంతిప్రియ తన కళ్ళల్లో దీపావళి చూపించింది. శాంతిలత తన చెక్కిలి నీడల్లో సాయంత్రాన్ని సర్దుకొంది. శాంతిసిరి పెదాల్లో "మా సారథి ఎంతో బాగా పాడగలరు" అనే గర్వాన్ని దాచుకుంది. ఎంత బాగా విన్నారు వాళ్లు. వాళ్ళకి వినడంలో కూడా అందమే వుంది. ముగ్గురికి ముగ్గురే. చిత్రమైన కలయిక. మాటల్లో, పేర్లలో, చూపుల్లో, అందంలో, అంతా గమ్మత్తయిన ఏకత్వం— మనస్సుల్లో కూడానేమో. పైగా ఎంత చనువు—తన పాట వినేందుకు ఎంత దగ్గరగా కూర్చున్నారు. పక్షుల్లో నెమలిలా, పువ్వుల్లో గులాబీలా, మానవుల్లో శాంతి త్రయం—యిదేనేమో సృష్టికర్త ప్రత్యేకత. ఇప్పుడు వాళ్ళల్లో ఒక్క శాంతి, ఒక్కగానొక్క శాంతి తన్ను ప్రేమిస్తే తనకీ భూమ్మీద మరి కోరిక లుండవు. కానీ అది సాధ్యమా? సాధ్యమే అయితే నిజంగా తను చక్రవర్తే! అప్పుడు తను చక్కగా రోజూ తన శాంతిని పక్కన కూర్చోబెట్టుకుని తన కొచ్చిన ప్రేమ గీతాలన్నీ ఫిడేలు వాయించి వినిపించవచ్చు. తల్చుకుంటేనే ఎంత బావున్నాయి తన ప్రేమ క్షణాలు. కాని తన ప్రేమ, ఫిడేలు వాయించడంకోసం అంటే ఎవరూ నమ్మరు—ఇలా కాస్సేపు ఆలోచనలు సాగేక సారథి జ్వరం తగిలినట్టు ఫీలయ్యేడు. ఏదో బలమైన కోరిక తన హృదయం పట్టుకు వ్రేళ్ళాడుతున్నట్టుంది. ఏదో తియ్యటి బాధ తనలో నరాల్ని గిజ

గజ లాడిస్తున్నట్లుంది. అందమైన అమ్మాయిల దగ్గర పాట పాడితే యిలాగే వుంటుంది కాబోలు. అయినా తన మస్తిష్కంలో యింకేదో విప్లవం జరుగుతోంది. క్షణ క్షణానికి శాంతిత్రయం తన మనస్సుకి మరీ దగ్గరగా వచ్చేస్తున్నారు. ఏమిటో ఈ సుఖంలో కూడా బాధ — ప్రేమంటే యిదేనేమో!

ఈ విధంగా చాలా రాత్రి గడిచే వరకూ సారథి మెదడులో ఎన్నో ఆలోచనలు పుట్టి, శాంతి ఆశ్రమంలో సరుగుడు వృక్షాల్లా — బలంగా, ఏపుగా, అసంఖ్యాకంగా పెరిగేయి. కాని, వృక్షాలు ఆశ్రమం చల్లదనానికి తోడైతే, ఆలోచనలు గుండెల్లో వేడికి తోడయ్యేయి.

క్రమంగా సారథి నిద్రలోకి జారేడు. నిద్రలో అతని ఆలోచనలన్నీ కలలుగా మారి అల్లరి చేసేయి. కలలో సారథి, తన శరీరంలో రేగిన విప్లవాన్ని కళ్ళతో చూసేడు. అలా చూసుకొన్నప్పుడు సారథికి, తన గుండె లోపలి గదుల్లో రక్తం కనబడలేదు. కుడి కర్ణికలో శాంతిప్రీయ, కుడి జఠరికలో శాంతిలత కూర్చుని వొంట్లో వున్న జీవకణాలన్నిటినుంచి కొత్త వుద్రేకాల్నీ, కొత్త కోరికల్ని రాబట్టి— ఎడమ కర్ణికలో కూర్చున్న శాంతిసిరి కిస్తున్నారు. ఆమె వాటినన్నిటినీ కలిపి, చిలికి శుభ్రమైన ప్రేమం తయారు చేసి, ఎడమ జఠరిక నిండా నింపుతోంది. తిరిగి ఎడమ జఠరిక నుండి శుభ్రమైన ప్రేమ—పదునైన వుద్రేకాల్తోనూ, పదునైన కోరికల్తోనూ ప్రవహించి కణకణానికీ వ్యాపిస్తోంది. ఇలా ప్రేమ ప్రసరణం జరుగుతున్నప్పుడు పార్థసారథి గుండె 'లబ్ డబ్' అని కొట్టుకోడం మానేసి, 'లవ్ హెర్' అని కొట్టుకుంటోంది.

ఈ విధంగా — అవాళ్టి వరకూ శాంతి ఆశ్రమంలా వున్న సారథి గుండె ఆ రాత్రి శాన్ ఫ్రాన్సిస్కోలా మారింది.

● ● ●

మర్నాడు సారథి రోజూకంటె ఆలస్యంగా లేచేడు. వొళ్ళు బద్ధకంతో బరువెక్కింది. కళ్ళు కలల బరువుతో ఎరుపెక్కేయి. నిలువెల్లా

---

● 'నాన్నా, నాన్నా! ఎప్పుడూ ఇంట్లోంచి కదలనియ్యవ్. బయటికెళ్ళి గోలీకాయ లాడుకుంటా నాన్నా!'

'నోరు మూసుకుని ముందు ముక్కు వెయ్.'



ఒత్తుగా మెత్తగా నిగనిగలాడే
సుదీర్ఘ కేశసంపదకు

**కేశవర్ధిని**
**పెట్టిందిపేరు**

కొబ్బరినూనెతో తిరిగి కలప
నవసరంలేకుండా వాడడానికి

**కేశవర్ధిని**
**రెడీమిక్స్డ్ హేరాయిల్**

మీ శిరోజాలను పరిమళ
భరితంగా శుభ్రంగా ఉంచడానికి

**కేశవర్ధిని షాంపూ**



**కేశవర్ధిని ప్రాడక్ట్స**
27 మానిలామణి
మొదలియార్ రోడ్,
మద్రాసు-14.

నీరసం నిలిచింది. అవయవాలన్నీ సత్యాగ్రహం చేసినట్టు మారేయి. మనస్సు ఆలోచనల బరువుకి క్రుంగిపోయినట్టయింది. ఇంతలో టేబులు మీద టైంపీసు, కాలేజీకి టైమయింది త్వరగా తయారవమని హెచ్చరించింది. సారధిస్థితి మాత్రం కాలేజీకి వెళ్ళగలిగేలా లేదు. కాని ప్రచండుడైన ప్రొఫెసరు గుర్తుకి రావడంతో సారధి త్వరపడక తప్పలేదు. గబగబా ఓసారి 'ఛటర్జీ' తిరగేసి చకచకా తయారయ్యేడు.

కాలేజీకి వెళ్ళేక, సారధి ఆరోజు క్లాసు కూడా తీసుకోవలసొచ్చింది. లెక్చరు మధ్యలో, మధ్య వరసలో కూర్చున్న తన శాంతిత్రయాన్ని, వెనుక బెంచీలో కూర్చొన్న క్రానిక్ రిఫర్డ్ కాంతారావు అదేపనిగా విశ్లేస్తూ తన కాయిశకులా శాంతిత్రయాన్ని నవ్వించడం చూసేడు. ఒక్కసారి కోపం ముంచుకొచ్చింది. తన ప్రణయ దేవతల్ని విశ్లేసి నవ్విస్తాడా? ఎంత దురాగతం? అనుకుని కాంతారావుని నిండు బెంచీల మధ్యనిలబెట్టి పాఠంలో ప్రశ్న వేసేడు. కాంతారావు అప్పు చెప్పగానే వీలు చూసుకుని నాలుగూ దులిపేశాడు. ఛటర్జీ'. చదివి చెడిపోయావన్నాడు. 'బి. టి' చదివి బాగుపడమన్నాడు. మాట్టాడకుండా

కూర్చొమన్నాడు. కాంతారావు పాపం చేసేదిలేక పార్థసారథిని గుడ్లురిమి చూసి కూర్చున్నాడు. పాఠం చెబుతున్నంతసేపూ సారథికి ఏదో మైకం కమ్మినట్టుంది, స్టూడెంట్సు గోలచేసినా వినబడలేదు. ఎదురుగా కూర్చొన్న శాంతి త్రయం తప్ప క్లాసులో మరెవ్వరూ అతనికి కనబడలేదు. చివర్న 'టైమయిపోయింది మాస్టోయ్!' అని అబ్బాయిలంతా అరిచేదాకా, సారథి క్లాసు వదిలి రావాలన్న సంగతే గుర్తుకి రాలేదు.

ఆ మధ్యాహ్నం స్టాఫ్ రూమ్‌లో కూర్చొన్న సారథికి ప్రొఫెసరుగారివద్దనుంచి పిలుపురాగానే లేచేడు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ, ఆలోచనలో ఆలోచన పేర్చుకుంటూ, ప్రొఫెసరుగారి గదిలోకి అడుగుపెట్టేడు. టేబులు వెనుక కుర్చీలో ప్రొఫెసరుగారు సర్కసు పులిలా కూర్చుని, పూరీలు తింటూ, ఛటర్జీ ముందేసుకుని దీక్షగా 'సి. ఎన్. ఎస్' బట్టీ పడుతున్నారు. సారథిని చూడగానే ఆయన పూరీప్లేటు చటుక్కున దాచేసి, చదివే పేజీల మధ్య గుర్తు కోసం ఒక పూరీ వేసి. పుస్తకం మూసేసి, గాండ్రుమని దగ్గేరు. పులిగా మారినప్పుడల్లా యిలా ప్రొఫెసరుగారు అస్త్మా పేషెంటులా అల్లరి చేస్తారని డిపార్టుమెంటంతకీ బాగా తెలుసు.

సారథి కంటిముందు పడగానే ప్రొఫెసరుగారు యింగ్లీషులో యింగ్లీషు పులిలా గర్జించేరు — 'పొద్దున్న ఏం తినుకున్నావ్?'

సారథి సవినయంగా అన్నాడు 'చపాతీ సార్.'

'షటప్! చపాతీ కాదు నే నడిగింది.' ఈ సారి ప్రొఫెసరుగారు గర్జించినప్పుడు సారథిమీద చినుకులు పడ్డాయి. (కండిషన్డ్ రిఫ్లెక్స్) 'క్లాసులో తీసుకున్న సబ్జెక్టేంటి—చెప్పిన భాగోతమేమిటీ అని అడుగుతున్నా?'

సారథి యింకా వినయం మానలేదు. 'భాగోతం కాదు సార్— బ్లడ్!'

'బడ్డే బడ్డు. బ్లడ్‌లో ఏ టాపిక్కు?'

'ఆర్. బి. సి. సార్!'

'శాంతి దగ్గర ప్రిపేరయ్యే వచ్చావా?'

'అవును! సార్!'

---

● నేటి బాలురే రేపటి వృద్ధులు.

— ఎస్. ఆర్. బాబూరావు

'మరయితే క్లాసులో ఆ పేలావ నేవిటి ?'

'తప్పు చెప్పానా సార్ !'

ఒక్కసారి ప్రొఫెసరుగారు కుర్చీ లోంచి లేచి వొళ్ళు దులువు కున్నారు. 'తప్పా ? తప్పన్నరా ? రక్తంలో ఎర్రకణాలేకాక ప్రేమ కణాలు కూడా ఉంటాయా ? వాటి పేరు శాంతి కణాలా ? అవి మూడు రకాలా ? పైగా రక్తంలో అవి బాగా ఎక్కువగా తగులడితే 'పోలీ శాంతీమియా వీరా' అనే రోగం అఘోరిస్తుందంటావా ?' అంటూ దసరా పులి డ్యాన్సు చేసేరు— పిమ్మట ఆయన యింకా యిలా డ్యాన్సు చేసేరు—

'ఎర్ర కణాలన్నెప్పీ బోర్డుమీద అతీను బొమ్మ లేస్తావా ? పైగా యివన్నీ నేను చెప్పమన్నానని చెబుతావా? అసలేవిటి నీ ఉద్దేశ్యం' అంటూ ఆయాస పడ్డారు.

సారథి మెల్లగా 'వొంట్లో బాగు లేదుసార్—' అని గొణిగేడు.

'ఒంట్లో బాగులేకపోతే యింట్లో ఏఘోరించాలి. అంతేగానీ క్లాసు కొచ్చి అవాకులు చెవాకులు చెబుతావా ?—వెళ్ళు. తిన్నగా ఇంటికి వెళ్ళు. వెళ్ళి మళ్ళీ వారం రోజులు పోయేవరకూ డిపార్టుమెంట్లో అడుగెట్టకు. గెటవుట్ !' అని చెడా మడా దులిపేసేరు. సారథికి తన బొమ్మ తలంటిపోయడం గుర్తు కొచ్చింది.

రూముకి తిరిగొచ్చి మంచం మీాదికి బరువుగా వాలేక, నిద్రకి బదులు క్రమంగా తీరని అస్వస్థత అతన్ని ఆవహించింది.

● ● ●


నాలుగురోజులు గడిచేక సారథి పుట్టిన రోజు వచ్చింది. ప్రపంచాన్ని క్రమక్రమంగా మరిచిపోతున్న పార్థ సారథి, తన పుట్టినరోజు మాట కూడా మరచిపోయేడు. ఈ నాలుగు రోజులూ మంచి పుస్తకానికి చెదలు పట్టినట్టు అతడి మనస్సుని ఆలోచనలు పట్టి చాలావరకూ తినివేసేయి. అలా మిగిలిన చాలీచాలనీ మనస్సుతో అవసోపాలు పడుతున్న సారథికి ఆ సాయంత్రం మూడు వుత్తరా లొచ్చేయి. అసరాలన్నీ కోల్పోయానని మథనపడే సారథికి ఆ వుత్తరాలు మూడూ దేవతల్లా కనిపించేయి. అతను వాటిని ఆత్రంగా విప్పి చూసుకున్నాడు. నిజంగా అవి అతని దేవతలు రాసిన వుత్తరాలే. శాంతిలత, శాంతిప్రియ, శాంతిసిరి అనే సంతకాల తేడా తప్ప మిగిలిందంతా ప్రతి దాంట్లోనూ ఒకే లాగువ వుంది.

అతను జాగ్రత్తగా చదువుకోడం మొదలు పెట్టేడు.

ప్రియమైన సారథిగారికి—

నమస్తే!

నాలుగురోజులు మీరు కనబడక పోయేసరికి మనస్సుకి జ్వరం వచ్చినట్టుంది నాకు. కలలు కరిగిపోతాయంటారు. ఏమో అనుకున్నాను. కాని నిజంగా మీ రిప్పుడు నా నాలుగు రోజుల కలల్నీ కరిగించి వేశారు. పుట్టిన రోజన్నారు. పార్టీ అన్నారు. పాటన్నారు. పిలుస్తానన్నారు. ఏమీ జరగలేదు. నన్ను మరచి పోయేరల్లే వుంది. కాని—డియర్ సారథీ! మీరు నన్ను మరిచిపోయినా, నేను మిమ్మల్ని నా జ్ఞాపకాల్లో భద్రంగా దాచుకోగల్గుతున్నాను. మీరు నన్ను పిలవకపోయినా, మీ పాట వినే భాగ్యం నాకు లేకపోయినా నాకు మీ మీద కోపం రాలేదు. మీ రిలా చెయ్యడంవల్ల నాకు మీ రింకాదగ్గరయి పోయినట్టనిపించింది. అంచేత ఈ రోజు పుట్టిన మీకోసం నేసివ్వగలిగిన స్వల్పమైన కానుక ఒకటి మీకు సమర్పిస్తున్నాను. మీకిది కేవలం యీ వొక్క పుట్టిన రోజుకే కాదు — జీవితాంతమూ యిది మీ కానుకగా నిలిచి పోవాలని. ఈ కానుక పేరు శాంతిసిరి



దయతో తప్పక గ్రహిస్తారనే ఆశతో—

మీ,

శాంతిసిరి.

మిగతా రెండు ఉత్తరాల్లో శాంతిసిరి అని వున్నచోట, ఒక దాంట్లో శాంతిప్రియ అనీ, మరో దాంట్లో శాంతిలత అనీ రాసుంది తప్ప మిగిలిన విషయం అంతా మక్కికిమక్కి కాపీ చేసి గాసినట్టుంది. ఒకే ఉత్తరాన్ని మూడు సార్లు చదువుకున్నట్టు, ఆ మూడింటినీ ఒక్కొక్కసారి చదువుకున్నాక సారధికి స్పృహ తప్పినట్టయింది. తను చదివే సీరియల్ నవల సగంలో సమాప్త మయినట్టయింది. శాంతిత్రయానికి అందులో నేకాక ఆలోచనల్లో కూడా ఏకత్వమే కాబోలునని ఆశ్చర్యపోయేడు. వాపోయేడు. క్షణంలో సారధి గుండెలో జపానులో భూకంపంలా తుఫానులో తిరుక పంలా ప్రేమ గందరగోళం చెలరేగింది.

—ఈ విపరీతాన్నిప్పుడు తను అదృష్ట మనుకోవాలా? దురదృష్ట మనుకోవాలా? ఏమిటీ దారుణం? చేతికందవనుకున్న అందాలుమూడూ హఠాత్తుగా పందాలు వేసుకుంటూ తన మనస్సుకేసి ఎందుకిలా పరుగులు తీస్తున్నాయి. ఇన్నాళ్లూ శాంతిత్రయం సరసన పాట పాడటమే మహా భాగ్యం అనుకున్నాడు తను. వారిలో వొక్కగానొక్క అమ్మాయి తన్ను వలచి వరిస్తే చాలనుకున్నాడు తను. కాని అనుకున్నదంతా అతినిజమయిపోయింది. మహా నిజమయిపోయింది. హే! భగవాన్! ఏమిటీ యూనివర్సిటీ పరీక్ష? శాంతిత్రయం చూపులకే తట్టుకోలేక జ్వరం తెచ్చుకున్న నా బలహీన మయిన మనస్సు యిప్పుడే ధాటికి తట్టుకోనగలదు? మూడు రేసు అశ్వములను, కూర్చిన నా ప్రేమ రథమునకు నేనెట్లు సారథిని కాగలను? నా కర్తవ్య మేమిటి పరాత్పరా? అనుకుంటూ సారధి అదే పనిగా చాలా సేపు రోదించేడు. చివరికి ఏమీ తోచక ఏదో హిందీ సినిమాకి వెళ్ళేడు. తీరా చూస్తే — పాపం!— ఆ సినిమాలో హీరోకి కూడా తనలాంటి బాధే ఎదురయింది. కాని ఆ హీరో తనకంటె చాలా అదృష్టవంతుడిలా కనిపించాడు తనలా అతడికి ఒకే రకమైన అందం, తెలివితేటలు, మనస్తత్వం గల స్త్రీలు ఎదురు కాలేదు. అసలు వాళ్ళ ప్రేమ దృక్పథంలో నే తేడా వుంది. అంచేత ఆ హీరో తన సమస్యని స్వల్ప శ్రమతోనే పరిష్కరించుకో గలిగేడు. కాని తను? శాంతిత్రయం ప్రేమల్లో ఎవరి ప్రేమ గొప్పదో ఎలా నిర్ణ

యుంచుకోవాలి ? ఎవరి అందం గొప్పదనుకోవాలి ? ఎవరి మనస్సు గొప్పదనుకోవాలి ? — అయినా తనది జీవితం. అది సినిమా. తన జీవితం సినిమా అయితే ఎంత బావుణ్ను ? — అనుకుంటూ నెమ్మదిగా రాత్రి పది గంటలకి రూము చేరాడు సినిమా చూసిన సారధి.

మంచంమీద నడుంవాల్చి కళ్ళు మూసుకు పడుక్కున్నాడు. అయినా అతనికి నిద్రపట్టలేదు. పక్కకి తిరిగి చెయ్యి రేడియో వున్న టేబులు మీదికి పోనిచ్చి మెల్లగా రేడియో ట్యూన్ చేసేడు. వివిధ భారతిలో విషాద గీతం వినబడింది. ఇన్నాళ్లూ సిలోన్ పాటలా వున్న తన జీవితం యిప్పుడు వివిధ భారతి పాటలా విషాద భరితమయిపోయింది. అసలు తన జీవితమే ఒక విషాద స్వరూపం, దాన్ని చూడాలని తను ప్రేమ అనే దీపాన్ని వెలిగించుకున్నాడు. దీపం వెలిగింది కాని జీవితం పూర్తి స్వరూపం అంతా కనబడలేదు. అంతా కనబడేలా చేసుకునే ప్రయత్నంలో దీపం కాస్తా ఆరిపోతుందేమో !

సారధి క్రమంగా ఇలా వేదాంత ధోరణివైపు జరిగి, మంచంలో కింద పడుతూండగా, పెద్ద పెర్సనాలిటీ గల ఎదురింటి ప్రభాకరానికి ఏమీ తోచలేదు. తన 30వ ఏట ఎం. బి. బి. ఎస్. ఫైనలియరు చదువుతున్న ప్రభాకరం సారధికి పాత క్లాస్‌మేటు. ఇప్పుడే కాదు — నాలుగు రోజులనుంచీ ప్రభాకరానికి ఏమీ తోచటం లేదు. పైగా రాత్రిళ్లు నిద్ర బాగా పడుతోంది. ఎంచేతంటే ఈ నాలుగు రోజులూ ప్రభాకరానికి ఫిడేలు చప్పుళ్ళు వినిపించటం మానేశాయి. ఏమీ తోచని ప్రభాకరం అసలు సంగతి యిప్పుడే పసిగట్టగలిగేడు. వెంటనే అతను సారధి రూములో కొచ్చాడు.

ఎదురుగా ఎత్తుగా ప్రతిమలా నిలబడ్డ ప్రభాకరాన్ని చూడగానే సారధికి ప్రాణం లేచివచ్చింది. అప్పుడు తనుకూడా లేచొచ్చి ప్రభాకరాన్ని లోపలికి ఆహ్వానించేడు. ప్రేమ కేసుల్లో పదేళ్ళుగా పాతబడిన ప్రభాకరం సారధి మొహం చూస్తూనే అతని బాధేమిటో చూచాయగా ఊహించేసేడు. తర్వాత రేడియో కేసి ఓ చూపు విసిరి "ముందా భారతి నోరు కట్టెయ్. ఆలిండియా రేడియో వింటే ఆరోగ్యం చెడిపోతుంది" అని రేడియో ఆఫ్ చేయించి సారధిని మంచంమీద కూర్చోబెట్టి కుర్చీ ఒకటి దగ్గరగా లాక్కుని తను కూడా కూర్చుని మాట్లాడేడు.

"అసలు నీకు తెలుసో తెలియదో గానీ ఈ రోజుల్లో మన పడుచు వాళ్ళ మెదళ్ళని ఆడవాళ్ళూ, ఆలిం

డీయో రేడియో వాళ్లూ చెదపురుగుల్లా దొలిచేస్తున్నారు' అని సిగరెట్టు వెలిగించి సీరియస్‌గా ఆలోచించి మళ్ళీ అన్నాడు — 'నువ్వు సిక్కుపడి నాలుగు రోజులైంది కదూ?'

సారథి ఆశ్చర్యంగా చూసేడు.

'నువ్వు ప్రేమలో పడికూడా నాలుగు రోజులైంది కదూ?'

'ఎలా తెలుసు నీకు?!' సారథి ఆశ్చర్యం ప్రశ్నగా మారింది. ప్రభాకరం చిరునవ్వు పొగలు కక్కింది. ఆ పొగల మధ్య తల పంకించి అన్నాడు.

'ఇందులో తెలిసేందుకేం వుంది బ్రదర్! నాలుగు రోజులనుంచి నువ్వు ఫీడేల సాము మానేసినట్టు వీధంతా కోడై గుడ్లు పెట్టడం కూడా మానేసి కూస్తోంది. నిన్నిప్పుడు చూస్తే ఎలాగూ సిక్కు పడ్డావని తెలుస్తూనే వుంది. పైగా ఏది కేవలం మానసిక సిక్కని నీ కళ్ళే చెబుతున్నాయి. ఇక పోతే నీ ఏజ్‌లో ఏ మగాడైనా సిక్కు మనస్సుతో చిక్కిపోవడాన్ని ప్రేమ జ్వరం అంటారు.' అనుభవజ్ఞుడైన ప్రభాకరం మాటలు వినగానే సారథికి కొండంత అసరా దొరికినట్టయింది. గబగబా శాంతిత్రయం రాసిన వుత్తరాలు చూపించేడు. ప్రభాకరం వాటిని పరిశీలనగా చూసి అన్నాడు-

'వీళ్ళు పరీక్షలు కూడా యిలాగే రాస్తారులా వుంది.'

'అప్పుడైతే అంతరంగంలో భరించలేని అలజడికి నేను బలైపోతూ వుంటే ఏమిత్రా ఈ నీ వేళాకోళం? నా జీవితం—' సారథి ఏదో మాట్లాడబోయేడు.

'ముసిలి నర్సులా చంపక ముందు అసలు సంగతి చెప్పు' లేచి సిగరెట్టు పారేసి, గదిలో అటూ ఇటూ బాతులా పచార్లు చేయడం ప్రారంభించేడు ప్రభాకరం.

అప్పుడు సారథి తన బాధనంతా చాలాసేపు వొలకబోసి—'యిన్నేళ్లు డాక్టర్ చదివినా అసలు నేనెందుకిలా చిక్కి శల్యమై పోతున్నానో నా కర్థం కావడంలేదు' అని బావురుమన్నాడు. సారథి చెప్పిందంతా ప్రభాకరం మునిలా విని, పచార్లు మానేసి బక బక నవ్వేడు—'ఒరేయ్ సారథీ! నువ్వెంత అమాయకుడివిరా? మనకి ప్రేమ జ్వరం కోర్సులో లేదన్న సంగతి నీకు తెలియదూ? అఖరికి ఈ జ్వరం వచ్చిన పేషంట్లకి హాస్పిటల్లో బెడ్స్ కూడా లేవు. ఈ జ్వరంరాని మిగతా పేషంట్సుకేనా సరిగ్గా బెడ్సు లేవనుకో. అది వేరే సంగతి. ఆ మాటకొస్తే అసలీ ప్రేమ వ్యాధికి క్యూరే లేదు—కేన్సరులాగే. కాకపోతే ఒక్కటే తేడా. కేన్సరొస్తే చచ్చిపోతారు. ప్రేమజ్వరం వస్తే

పెళ్ళి చేసుకుంటారు. అదే అమ్మాయి కాకపోవచ్చు. ఏమయితేనేంలే చికిత్స చేస్తే మంచి ఫలితాలే వున్నాయి దీనికి. కాబట్టి కంగారు పడకు. ఇప్పుడు నీ కొచ్చిన ప్రేమ జ్వరం కొత్త కోవకి చెందినది. దీన్ని 'పోలీ శాంతీ మియా వీరా' అందురు. శాంతిసిరి, శాంతిప్రియ, శాంతిలత — అనబడే ఈ ముగ్గురమ్మాయిలూ నీ రక్తంలో చేరి కణకణానికీ వ్యాపించేశారు. ఇప్పుడు నీలో మితిమీరిపోయిన ఆ శాంతికణాలే యీ నీ అశాంతికి కారణం. ఇదే కణ్ కణ్ మె కావల్! ఇష్కీ మియా, రక్తం నిండా ప్రేమ! మరేం భయం లేదు. కోలుకొనే ఉపాయం నేను చెబుతాలే—' అని హామీ యిచ్చి ఊరడించేడు సారథిని ప్రభాకరం. అయినా సారథి మనస్సుకి స్వాస్థ్యం చిక్కలేదు. 'ఒరే ప్రభాకరం! ఇలాంటి పరిస్థితిని యింతవరకూ నా జీవితంలో నేనెప్పుడూ ఎదుర్కోలేదు. కాబట్టి నువ్వే నాకిప్పుడు ఏదో ఒక తరుణోపాయం చూపించి నన్నీ ముగ్గురి బారినుండీ కాపాడాలి. నన్ను శాంతి విముక్తుణ్ణి చెయ్యాలి' అన్నాడు దీనంగా, మంచం మీద యోగివేమనలా కూర్చొని. అప్పుడు ప్రభాకరం మళ్ళీ యిందాకటిలాగే చిరునవ్వు నవ్వి తల పంకించి— 'భయపడకు! అన్నిటికీ నే నున్నాను. నిన్నిప్పుడు తప్పించవలసింది ఆ ముగ్గురి బారి నుండి కాదు. నీ ప్రేమ జ్వరం బాధ నుంచి నిన్ను తప్పించాలి. తరుణీ మనస్కుడవైన నీకు సిసలైన తరుణోపాయం ఒకటి చెబుతాను విను.' అని టేబులు మీది నుంచి తెల్ల కాగితం తీసి, గబగబా దానిమీద ఏదో రాసి సారథి చేతికిచ్చి, అతను చెప్పులు తొడుక్కుంటూ 'వెంటనే దీనికి మూడు కాపీలు తీసి పొద్దుటే ముగ్గురికీ పోస్టించు. వేళ చూసుకుని మళ్ళా నేనే నీ దగ్గరికి వస్తా. భయపడకుండా బబ్బో!' అని హామీ యిచ్చి నిష్క్రమించేడు.

ప్రభాకరం వెళ్ళాక, చేతిలో కాగితాన్ని చూసుకున్నాడు సారథి.

'డియర్ శాంతీ,

మీ ఉత్తరం చూశాను. కాని— యిన్నాళ్లూ నేను మిమ్మల్నొక సోదరిగా భావించాను. ఇప్పుడు మరో విధంగా భావించుకోలేను. అసలు మరోలా భావించుకోడానికి నా మనస్సు నెప్పుడూ తరిఫీదు చేసుకోలేదు నేను. కాబట్టి మీ కానుకని గ్రహించలేని స్థితిలో వున్నాను. వీలైతే క్షమించండి. మీ సారథి'

ఇది చదువుకున్నాక దీనికి సారథి మూడు కాపీలు తీసేడు. కాపీ చేసే

టప్పుడు ఏదో విలువైన వస్తువును కోల్పోతున్నట్టు ఫీలయ్యేడు.

కాని అంతలోనే, మనస్సులో బెడద వదిలిపోతున్నందుకు సమాధాన పడ్డాడు. సంబరపడ్డాడు. మర్నాడు పొద్దుటే వాటిని పోస్టు చేసేడు.

• • •

ఆ తర్వాత రోజు కిటికీ పక్కన వాలుకుర్చీలో కూర్చొన్న సారథికి పోస్టుమేన్ వచ్చి నిన్నటిలాగే మూడు ఉత్తరాలిచ్చేడు. ఉత్తరాలు అందుకుంటున్న సారథి, ఊహించని శాంతిప్రియుం రెస్పాన్సుకి కాస్త చిరాకు పడినా, తన ఆధిక్యత అంతగా పెరిగినందుకు కాస్త గర్వపడ్డం కూడా ఉచితం అనుకున్నాడు. అప్పుడతనికి కిటికీలోంచి కనిపించిన దూరంగా నడిచే పోస్టుమేన్ 'హంస'లా అగుపించేడు. తర్వాత సారథి ఆ ఉత్తరాల్ని తీరిగ్గా చదువుకున్నాడు. అవి పాతవాటిలా ఒకే మూసలో పోసినట్టు లేవు. భిన్నంగా వున్నాయి. ఇలా వున్నాయి.

మొదటిది—

సారథిగారికి నమస్కరించి
వ్రాసేది—

మీ అందం చూసి మిమ్మల్ని ప్రేమించాను. జీవితం చివరిదాకా మిమ్మల్ని గుండెల్లో కూచోబెట్టుకొని పూజల్చేసుకుందామనుకున్నాను. కాని నన్ను మీరు తిరస్కరించారు. నా ఆశల్ని అపహాస్యం చేశారు. నాలో ఎంతక్కువో నా కర్థం కాకుండా చేశారు. ఎందుకో నాకు తెలియదనుకోకండి. మీకు చాలా అందంగా వుంటాననే గర్వం బాగా వుంది. అందుకే నన్నిలా చులకన చేశారు. చేస్తే చేశారు. పోనిండి. ఇక ముందైనా యితరుల విషయంలో యిలా చెయ్యడం మానుకోండి. మానుకోకపోతే మీకు జన్మలో పెళ్ళికాదు. ఎందుకంటే తన అందానికి గర్వపడే మగాణ్ణి ఏ ఆడదీ ఎన్నుకోదు. ఒక్కమాట— నేను మీ నెచ్చెలి కావాలనుకున్నాను కాని, మీ చెల్లెలు కావాలనుకోలేదు. కాబట్టి క్షమించండి.

సెలవ్,
శాంతిలత.

రెండోది—

ప్రియమైన సారథిగారూ,

నమస్తే! మీ వుత్తరం అందుకుని చదవాను. మీతో కలిసి బ్రతికే భాగ్యం నాకు దక్కలేదు. కాబట్టి నేను చాలా దురదృష్టవంతురాల్ని. కాని ఎట్ ది సేమ్ టైమ్, నాలో కనీసం సోదరి అర్హత మీకు కనిపించినందుకు, అదృష్ట


వంతురాలిని. కృతజ్ఞురాలిని కూడా. దయచేసి మిమ్మల్ని ప్రేమించిన పొరపాటుకి నన్ను క్షమించండి.

మీ సోదరి,

శాంతిప్రియ.

మూడోది—

మీ ఉత్తరం చదివాను. నవ్వొచ్చింది. ఆశ్చర్యమేసింది. ఎందుకంటే మీగురించి నాకంతా తెలుసు ననుకున్నాను. నిజమేమరి. మగాడి గురించి తనకంతా తెలుసుననుకోడం ఆడదానికి తృప్తి, ఆడదాని గురించి తనకంతా తెలుసుననుకోడం మగాడికి ఆనందంలాగ. నిజానికి, ముగ్గురం కూడబలుక్కుని మిమ్మల్ని ఆడించాలనే ఉద్దేశ్యంతోనే ఆ ఉత్తరాలు రాశాం. కానీ మీ జవాబుఅందాక నా మనస్సు నాకు తెలిసింది. మిమ్మల్ని ఎందుకు వేళాకోళం చెయ్యాలనిపించిందో, మీలో ఈ ఆకర్షణ ఏమిటో యింతవరకూ తెలియని నాకు మీ జవాబు సమాధానం చెప్పింది. మీ జవాబుతో అహం దెబ్బతిని వ్యక్తిత్వం బైట పడింది. నాకు తెలియకుండానే నేను మిమ్మల్ని ప్రేమించినట్లు తెలిసింది. కాని, మీరు నాలో సోదరిని చూశానన్నారు. అంత మాత్రంచేత నేను తల వెనక్కి తిప్పి మీకు దూరంగా వెళ్ళిపోను. నా కసలే పట్టుదల హెచ్చు. మిమ్మల్ని దక్కించుకునేదాకా నాకు నిద్రపట్టదు. మీరు నాలో సోదరిని చూసినంత మాత్రాన మునిగి పోయిందేమీ లేదు. నిజం చెప్పాలంటే, భార్యలో—తల్లినీ, సోదరినీ, ప్రేయసినీ వూహించగల



పురుషుడూ, భర్తలో – తండ్రినీ, తమ్ముళ్ళనీ, ప్రియుడిని వూహించ గలస్త్రీ స్త్రీ–వాళ్ళు మఖానికి ప్రతి నిధులు. కానీ ఈ జాబితాలో ఏ[వొకర్ పేరో సాధారణంగా మిస్ అవుతూ వుంటుంది. అందుకనే స్త్రీ పురుషుల చరిత్ర ఎప్పుడూ అసమగ్రంగా వుండిపోతోంది. కాబట్టి యిప్పుడు మనల్ని మనంగా అర్థం చేసుకుని, మన భావాల్ని పవిత్రంగా మలుచుకో గలిగితే పరిపూర్ణత నిండిన ఒక జీవితానికి మనమూ ప్రతినిధులయ్యే అవకాశం వుంది. దయచేసి ఆలోచించండి. ఏమైనా నన్ను కాదనకండి. నాకు మీరు కావాలి. మీరే కావాలి. నేనెప్పటికీ మీ దాన్నే. త్వరలోనే పోజిటివ్‌గా కలుస్తారని ఆశిస్తాను.

ఇట్లు,

ప్రేమంటే తెలిసిన పార్థసారథి గారికి ప్రేమంటేనే తెలిసిన — శాంతిసిరి.

ఉత్తరాలు మూడూ చదువుకున్నాక సారథి పెదాలు అందంగా విరిసేయి. ఆ విరుపులో చిరునవ్వు మెదిలింది. అతని మనస్సులో ఆరోగ్యం కదిలింది. అప్పుడు సారథి మౌనంగా మూడో ఉత్తరాన్ని తీసి ప్రేమ రహస్యం చెప్పినట్లు మెల్లగా ముద్దు పెట్టుకున్నాడు. తర్వాత డైరీతీసి ఆ రోజు పేజీలో దాన్ని యిష్టంగా దాచుకున్నాడు. సారథి అలా దాచుకుంటున్నప్పుడు గుమ్మం దగ్గర అలికిడి వినబడి తల త్రిప్పి చూసేడు. అరడుగుల ప్రభాకరం హడావుడిగా లోపలికొచ్చి, రుమాలుతో ముఖం మీది చెమట తుడుచుకొని, తెగని సంతోషాన్ని పౌడరు వులుముకున్నట్టు పులుముకున్నాడు. అప్పుడు అర్ధనిమీలిత నేత్రాలతో ఈజీ చైర్లోకి వాలిన పార్థసారథి ఎడమ భాతీ మీదికి చెయ్యిపోనిచ్చి గుండె వెతుక్కుంటూ — 'ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః' అనుకున్నాడు.

[ అంకితం

'మెడికల రక్షకుడైన
శ్రీ చండీ చరణుని
చరణ కమలాలకు.' ]

□□□